జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం | 9 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 6

# ఖమ్మం-భద్రాద్రి కొత్తగూడెం గ్యాస్ పైపు లైన్ పనులు వేగవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 8,ప్రజా జ్యోతి:** ఖమ్మం నుండి భద్రాద్రి కొత్తగూడెం వరకు సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ పైపులైన్ విస్తరణ పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. ఈ మేరకు ఐడీఓసీ కార్యాలయం సమావేశ మందిరంలో బుధవారం సంబంధిత శాఖల అధికారులతో జిల్లా స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్, మెగా డిస్ట్రిబ్యూటరీ సంస్థ క్వాలిటీ ఇంచార్జ్ రామకృష్ణతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడి పైపులైన్ రూట్ మ్యాప్, ప్రస్తుత పనుల పురోగతి, ఎదురయ్యే సవాళ్లు, తీసుకోవాల్సిన

మిగతా 2 లో...

2 లో..

# క్లిక్ చేస్తే... అంతే సంగతి..!




- అశ్లీల చిత్రాలతో ఎరవేస్తున్న సైబర్ నేరగాళ్లు
- యువతే లక్ష్యంగా కొత్త ఎత్తుగడ
- క్రెడిట్ డెబిట్ కార్డుల సమాచారం తస్కరణ
- ఆన్‌లైన్‌లో అందిన కాడికి నగదు స్వాహా
- అప్రమత్తతే రక్షణ అంటున్న సైబర్ క్రైమ్ పోలీసులు

మీరు సీరియస్‌గా బ్రౌజింగ్ చేస్తుండగానో... సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో మునిగిపోయి ఉన్నప్పుడో... ఆకర్షించే విధంగా పాప్-అప్స్ వచ్చాయా..? హఠాత్తుగా మీ ఈ-మెయిల్‌కు గుర్తు తెలియని అడ్రస్ నుంచి 'ఫోటోలు'తో కూడిన సందేశం వచ్చిందా..? అలాంటి వాటిని క్లిక్ చేసే ముందు ఒక్క క్షణం ఆగండి. ఎందుకంటే అవి మిమ్మల్ని నిలువునా బుక్ చేసే ప్రమాదం ఉంటుందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి



# గోదావరి పుష్కరాల నాటికి తొలి దశ ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

- ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్

**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 8,ప్రజా జ్యోతి:** భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆలయ అభివృద్ధి పనుల పురోగతిపై దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు, ఆర్కిటెక్ట్ కృష్ణమూర్తి కలిసి బుధవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఐడీఓసీ కార్యాలయం వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ అంకిత్, దేవస్థానం ఈవో దామోదర్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ సెక్రటరీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం అభివృద్ధి పనులను చేపడుతోందని తెలిపారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి చేతుల మీదుగా అభివృద్ధి పనులకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించిన విషయాన్ని గుర్తుచేశారు. మూడు దశలలో చేపట్టనున్న ఈ ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా మొదటి దశ పనులను

మిగతా 2 లో...

# ధన్వంతరి కాలేజ్ పక్కన ఉన్న ఖాళీ స్థలం అడ్డాగా గంజాయి ముఠా


- 151.6 గ్రాముల గంజాయిని కలిగి ఉన్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసిన సుజాతనగర్ పోలీస్
- ఒకరు పరారిలో ఉన్నాడు.రెండు మొబైల్ ఫోన్లు,151.6 గ్రాముల స్వాధీనం.



**సుజాత నగర్ ప్రజాజ్యోతి ఏప్రిల్ 08:** మండలం లో 8 వ తారీకు న సాయంత్రం 3.35 గంటల సమయంలో సుజాతనగర్ ఎస్సై రమాదేవి తన సిబ్బందితో కొత్తగూడెం కు చెందిన షేక్ సమద్ యాకుబ్ పాషా మరియు సుజాతనగర్ మండలం

మిగతా 2 లో...

# పాల్వంచలో ఉరివేసుకొని విద్యార్థి ఆత్మహత్య




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణ పరిధిలో నీ వెంగళరావు కాలనీలో విషాదకర ఘటన చోటుచేసు కుంది ,ఆరవ తరగతి చదువుతున్న ఒక విద్యార్థి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్ కి ఉరేసుకొని మృతి చెందిన సంఘటన తీవ్ర కలకలం రేపింది, స్థానికుల తెలిపిన వివరాల ప్రకారం వెంగరావు కాలనీకి చెందిన భూక్య మహేందర్(12) అనే విద్యార్థి స్థానికంగా డి ఏవి పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు బుధవారం ఇంట్లో ఎవరు గమనించని సమయంలో ఫ్యానుకు ఉరేసుకున్నట్లు తెలిసింది, కొంత సేపటికి గమనించిన తల్లిదండ్రులు వెంటనే తన కుమారుడు మహేందర్ ను పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు, అయితే బాలుడిని పరిశీలించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించినట్లు సమాచారం, చిన్నవయసులోనే విద్యార్థి మృతి చెందడంతో వెంగళరావు కాలనీలో తీవ్ర విషాద వాతావరణం నెలకొంది, విద్యార్థి మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది

## గోదావరి పుష్కరాల నాటికి తొలి దశ ఆలయ అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

(మొదటి పేజీ తరువాయి... )

గోదావరి పుష్కరాల నాటికి పూర్తి చేసే విధంగా ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపట్టాలని ఆమె ఆదేశించారు. ఇందుకోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు తక్షణమే పూర్తి చేసి, వచ్చే వారంలోనే నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి పనుల ప్రారంభానికి ముందు నిత్యకళ్యాణ మండపం, దాసాంజనేయస్వామి మండపం, చిత్రకూట మండపం, దేవస్థానం కార్యాలయం, తూర్పు ప్రసాద కౌంటర్లు, మ్యూజియం, అద్దాల మండపం వంటి నిర్మాణాలను తొలగించాల్సి ఉండటంతో పాటు, ఆలయ నిత్య కార్యక్రమాలకు ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ భవనాల ఏర్పాటును వేగవంతం చేయాలని స్పష్టం చేశారు. పనులకు అవసరమైన టెండర్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, నిర్దేశిత కాలవ్యవధిలో పనులు ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆలయ అభివృద్ధి పనులతో పాటు గోదావరి పుష్కరాల నిర్వహణకు అవసరమైన అన్ని సదుపాయాలను సమకూర్చుతూ, పుష్కర ఘాట్ల నిర్మాణం వంటి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ దేవస్థానం ఆలయ అభివృద్ధి పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ నిర్వహిస్తామని, ఇందుకోసం ప్రత్యేకంగా నోడల్ అధికారిని నియమిస్తామని కలెక్టర్ వెల్లడించారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడుతూ పనుల అమలులో ఎటువంటి ఆలస్యానికి తావు లేకుండా వేగవంతంగా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పనుల పురోగతిలో ఎక్కడైనా ఆలస్యం తలెత్తిన వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని స్పష్టం చేశారు. అదేవిధంగా భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకొని, పనులను సమర్థవంతంగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశం లో ఆర్ అండ్ బి ఈ ఈ నాగేశ్వరావు, దేవస్థానం డి ఈ రవీంద్రనాథ్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఖమ్మం–భద్రాద్రి కొత్తగూడెం గ్యాస్ పైపులైన్ పనులు వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి... )

చర్యలపై సమగ్ర సమాచారం తెలుసుకున్నారు. ప్రాజెక్ట్ అమలులో ఉన్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. పైపులైన్ నిర్మాణంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. భూసేకరణ, అనుమతుల మంజూరు, రోడ్ల తవ్వకాలు, ట్రాఫిక్ నియంత్రణ వంటి అంశాల్లో జాప్యం లేకుండా వేగవంతమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం కల్పించిన సింగిల్ విండో విధానం ద్వారా 24 గంటల్లో అనుమతులు పొందే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని, డిగ్ అండ్ రీస్టోర్ సౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. జిల్లాలో ఎల్పీజీ గ్యాస్ కొరతను నివారించడానికి పీఎన్జీ సరఫరాను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలని పేర్కొంటూ, మెగా సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ సంస్థ సమన్వయంతో యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ ప్రాజెక్టును అత్యంత ప్రాధాన్యత గల అంశంగా పరిగణించాలని తెలిపారు. ఈ ప్రాజెక్ట్‌కు నోడల్ అధికారిగా జిల్లా పౌర సరఫరాల అధికారి ప్రేమ్ కుమార్‌ను నియమించినట్లు తెలిపారు. శాఖల మధ్య సమన్వయం కోసం పరిశ్రమల శాఖను బాధ్యతలు అప్పగించినట్లు వెల్లడించారు. సిటీ గ్యాస్ డిస్ట్రిబ్యూషన్ జిల్లా స్థాయి కమిటీ సభ్యులు పీఎన్జీ సరఫరా లక్ష్య సాధనకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో పంచాయతీరాజ్ శ్రీనివాస్, ఆర్ అండ్ బి ఈ నాగేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్లు, విద్యుత్ శాఖ ఎస్పీ మహేందర్, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, పంచాయతీ అధికారి సుధీర్, సంబంధిత శాఖల అధికారులు, సి జి డి కమిటీ సభ్యులు, పాల్గొన్నారు.

## ధన్వంతరి కాలేజ్ పక్కన ఉన్న ఖాళీ స్థలం అడ్డాగా గంజాయి ముఠా

(మొదటి పేజీ తరువాయి... )

దేగలమడుగు గ్రామానికి చెందిన కదురుబోయిన నరసింహరావు అను ఇద్దరు వ్యక్తులు నిషిదిత గంజాయితో వేపలగడ్డ లో ధన్వంతరి కాలేజ్ పక్కన ఉన్న ఖాళీ స్థలం లో పట్టుకొని వారి వద్ద నుండి 7580 రూపాయలు విలువ గల 151.6 గ్రాముల గంజాయిని, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగింది. చుంచుపల్లి సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆర్.వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేసి నిందితులను ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్ నిమిత్తం కొత్తగూడెం కోర్టులో హాజరు పరిచారు. షేక్ సమద్ యాకుబ్ పాషా , డ్రైవర్స్ కాలనీ, చాతకొండ.కుదురుబోయిన నరసింహారావు తండ్రి నాగరాజు, దేగల మడుగు గ్రామం సుజాతనగర్ మండలం వీరు కాకా పరారీలో ఉన్న నిందితుడు కిరణ్ శేషగిరి నగర్,కొత్తగూడెం. కాబట్టి గంజాయి కొనడం అమ్మడం సేవించడం రవాణా చేయడం కలిగి ఉండడం చట్టరీత్యా నేరం. గంజాయి కి సంబంధించి సమాచారం తెలిసిన యెడల పోలీస్ వారికి తెలియజేయగలరు. అట్టి వారిపై కఠిన చర్యలు తీసుకోబడును.



- అశ్లీల చిత్రాలతో ఎరవేస్తున్న సైబర్ నేరగాళ్లు
- యువతే లక్ష్యంగా కొత్త ఎత్తుగడ
- క్రెడిట్ డెబిట్ కార్డుల సమాచారం తస్కరణ
- ఆన్‌లైన్‌లో అందిన కాడికి నగదు స్వాహా
- అప్రమత్తతే రక్షణ అంటున్న సైబర్ క్రైమ్ పోలీసులు

# క్లిక్ చేస్తే... అంతే సంగతి..!

**మీరు సీరియస్‌గా బ్రౌజింగ్ చేస్తుండగానో... సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో మునిగిపోయి ఉన్నప్పుడో... ఆకర్షించే విధంగా పాప్-అప్స్ వచ్చాయా..? హఠాత్తుగా మీ ఈ-మెయిల్‌కు గుర్తు తెలియని అడ్రస్ నుంచి 'ఫోటోలు'తో కూడిన సందేశం వచ్చిందా..? అలాంటి వాటిని క్లిక్ చేసే ముందు ఒక్క క్షణం ఆగండి. ఎందుకంటే అవి మిమ్మల్ని నిలువునా బుక్ చేసే ప్రమాదం ఉంటుందని సైబర్ క్రైమ్ పోలీసులు హెచ్చరిస్తున్నారు**

● భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజాజ్యోతి

### ››› ఆ వివరాలు అత్యంత కీలకం

ఒక వ్యక్తికి చెందిన సొమ్మును ఆన్‌లైన్‌లో స్వాహా చేయడానికి సైబర్ నేరగాళ్లకు అతడి క్రెడిట్డె,బిట్ కార్డు నంబర్, సీవీవీ కోడ్‌తో పాటు కొన్ని వ్యక్తిగత వివరాలు అవసరం. ఇంటర్నెట్ బ్యాంకింగ్‌కు సంబంధించిన లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ తప్పనిసరిగా ఉండాలి. వీటితో పాటు ఓటీపీ కూడా ఎంటర్ చేయాల్సి ఉంటుంది. ఇవి లేకుండా ఆన్‌లైన్‌లో డబ్బు కాజేయడం సాధ్యం కాదు.సాధారణంగా ఈ వివరాల కోసం సైబర్ నేరగాళ్లు వివిధ పేర్లు, వెరిఫికేషన్లు అంటూ బ్యాంకు అధికారుల పేర్లతో ఫోన్లు చేయడం, మెయిల్స్ పంపడం, సూడో (నకిలీ) సైట్లు సృష్టించడం చేస్తారు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి అశ్లీలంతో ఎర వేస్తున్నారు.

### ››› యువతే టార్గెట్‌గా వెబ్‌సైట్లు

సైబర్ నేరగాళ్ల వలలో యువకులే ఎక్కువగా పడుతున్నారు. వీరిని లక్ష్యంగా చేసుకుని ఆకర్షించేందుకు కొన్ని అశ్లీల వెబ్‌సైట్లు సృష్టిస్తున్నారు. ఈ సమాచారం, అర్ధనగ్న,నగ్న చిత్రాలతో కూడిన పాప్–అప్స్‌ను వివిధ సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లలో, వెబ్‌సైట్లలో లింక్ చేస్తున్నారు.వాటికి ఆకర్షితులైన యువత వాటిని క్లిక్ చేస్తోంది. ఆ తరువాత అసలు మోసం ప్రారంభమవుతోంది. ఆ సైట్లో పూర్తిగా లాగిన్ కావాలన్నా, వీడియోలు,ఫోటోలు చూడాలన్నా కొంత రుసుం చెల్లించాలంటూ ప్రత్యేక లింక్ ఇస్తున్నారు. దీంతో డబ్బు చెల్లించడానికి వినియోగదారులు క్రెడిట్డె,బిట్ కార్డు వివరాలు, నెట్ బ్యాంకింగ్ సమాచారం నమోదు చేస్తున్నారు.నిగూఢంగా పనిచేసే ప్రత్యేక సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ వివరాలన్నీ నేరుగా సైబర్ నేరగాళ్లకు చేరుతున్నాయి. ఇవన్నీ వారి చేతికి చిక్కిన తర్వాత కావాల్సింది ఓటీపీ మాత్రమే. దీనికోసం అదే వెబ్‌సైట్లో ప్రత్యేక లింక్ ఏర్పాటు చేస్తారు. ఒకవైపు ఈ వివరాలతో ఆన్‌లైన్ లావాదేవీ ప్రారంభించి, ఓటీపీ వచ్చేలా ఆప్షన్ ఎంచుకుని వేచి చూస్తారు. వినియోగదారు ఓటీపీని నమోదు చేసిన వెంటనే లావాదేవీ పూర్తి చేసి ఖాతాలోని డబ్బును స్వాహా చేస్తారు.ఈ నేరాలకు పాల్పడేవారు విదేశీ సర్వర్లు ఉపయోగిస్తుండటంతో వారి వివరాలు కనుగొనడం కూడా కష్టమవుతోంది. ఈ స్కామ్స్ కోసం ప్రత్యేక కాల్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు అధికారులు అనుమానిస్తున్నారు.

### అప్రమత్తతే రక్షణ:

**సముద్రాల జితేందర్ :**
**సీఐ సైబర్ క్రైమ్ ,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా**



ఆన్‌లైన్ షాపింగ్, చెల్లింపులు వంటి కార్యకలాపాలు ఎప్పుడూ నమ్మకమైన వెబ్‌సైట్ల ద్వారానే చేయాలి. ముఖ్యంగా అశ్లీల వెబ్‌సైట్లు నిర్వహించే వారికి నైతికత ఉండకపోవచ్చని గుర్తుంచుకోవాలి. అలాంటి సైట్లలో మీ కార్డు లేదా బ్యాంక్ ఖాతా వివరాలు నమోదు చేస్తే, అవి దుర్వినియోగం అయ్యే ప్రమాదం ఎక్కువగా ఉంటుంది. ఈ తరహా సైబర్ నేరాల్లో మోసపోవడం చాలా సులభం. కానీ నిందితులను గుర్తించడం, డబ్బును తిరిగి పొందడం చాలా కష్టమైన ప్రక్రియ. అందువల్ల వినియోగదారులు ఎప్పుడూ అప్రమత్తంగా ఉండడం ద్వారా మాత్రమే సైబర్ నేరాలను నివారించగలరు. అదనంగా, ఇలాంటి అశ్లీల వెబ్‌సైట్ల ద్వారా ప్రమాదకరమైన వైరస్లు కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లలోకి ప్రవేశించే అవకాశం ఉంది. దీనివల్ల పరికరాలు దెబ్బతినడమే కాకుండా, ముఖ్యమైన డేటా పూర్తిగా నష్టపోయే ప్రమాదం కూడా ఉంటుంది.



# గిరిజన బిడ్డకు డాక్టరేట్

- కొత్తగూడెం పాలిటెక్నిక్‌కు గౌరవం తెచ్చిపెట్టిన అంగోత్ తారాసింగ్






**కొత్తగూడెం, ఏప్రిల్ 8 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ కళాశాల ఎలక్ట్రికల్ శాఖాధిపతి అంగోత్ తారాసింగ్ డాక్టరేట్ పట్టా సాధించి కళాశాలకు, జిల్లాకు గౌరవాన్ని తీసుకొచ్చారు. గిరిజన సమాజానికి చెందిన ఆయన సాధించిన ఈ విజయంపై పలువురు అభినందనలు తెలియజేశారు. ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగంలో సోలార్ ద్వారా రేడియల్ డిస్ట్రిబ్యూషన్ సిస్టమ్‌లో యాక్టివ్ మరియు రియాక్టివ్ పవర్‌ల నియంత్రణ అనే అంశంపై చేసిన పరిశోధనకు హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది. ఉస్మానియా యూనివర్సిటీలో ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బ్యాచిలర్, మాస్టర్ డిగ్రీలు పూర్తి చేసి ప్రస్తుతం కొత్తగూడెం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శాఖాధిపతిగా పనిచేస్తున్నారు. ఉద్యోగ బాధ్యతలతో పాటు ఆరు సంవత్సరాల పాటు కృషి చేసి పి.హెచ్.డి పట్టా సాధించారు. ఈ సందర్భంగా సాంకేతిక విద్యాశాఖ గిరిజన ఉద్యోగుల సంఘం కొత్తగూడెం పాలిటెక్నిక్ యూనిట్ తరఫున ఆయనను సన్మానించారు. టీజీ పి.ఏ.ఎల్.ఏ సంఘం నాయకులు దారావత్ శ్రీనివాస్ నాయక్, భూక్యా కష్ట నాయక్, గుగులోత్ స్వప్న మాట్లాడుతూ తారాసింగ్ సాధించిన విజయం గిరిజన జాతికి గర్వకారణమని విద్యార్థులకు ప్రేరణగా నిలుస్తుందని తెలిపారు. అనంతరం తారాసింగ్ మాట్లాడుతూ తన విద్యా ప్రయాణంలో సహకరించిన సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీమతి శ్రీదేవసేన, సెక్రటరీ పుల్లయ్య, కళాశాల ప్రధానాచార్యులు బండి శ్రీనివాస్, సహచర అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల అధ్యాపక బృందం ఆయనకు అభినందనలు తెలియజేశారు.

## ఏప్రిల్ 10న భద్రాచలంలో ఆదివాసి సాంస్కృతిక ఆత్మీయ సమ్మేళనం

- కోయ ఇలవేల్పుల చరిత్ర పుస్తకావిష్కరణ
- ముఖ్య అతిథిగా మంత్రి సీతక్క హాజరు




**భద్రాచలం, ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి:** భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన భవన్ లో ఏప్రిల్ 10న ఆదివాసి సాంస్కృతిక ఆత్మీయ సమ్మేళనం, కోయ ఇలవేల్పుల చరిత్ర పుస్తకావిష్కరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆదివాసి సంఘాల ఐక్యవేదిక ఒక ప్రకటనలో తెలిపింది. ఈ కార్యక్రమానికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మరియు స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ఆమెతో పాటు పలువురు శాసనసభ్యులు, కార్పొరేషన్ చైర్మన్లు, జిల్లా ఉన్నతాధికారులు, ఆదివాసి సంఘాల ప్రతినిధులు, ఆదివాసి పెద్దలు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ నేపథ్యంలో ఆదివాసి గిరిజన సంఘాల ప్రతినిధులు మరియు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరారు.

## నేడు సీజ్ చేసిన ఇసుకకు బహిరంగ వేలం

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 8 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలంలో నాగినేని ప్రోలు రెడ్డిపాలెంతో పాటు ఆయా గ్రామాల్లో అక్రమంగా నిల్వచేసిన ఇసుక స్టాక్ పాయింట్లలోని 83 ట్రిప్పుల ఇసుకకు గురువారం ఉదయం బహిరంగ వేలం వేయడం జరుగుతుందని తహశీల్దార్ కేఆర్కే ప్రసాద్ బుధవారం తెలిపారు. ఈ బహిరంగ వేలం పాట ఉదయం 11 గంటలకు పోలీసు, మైనింగ్ శాఖల సమక్షంలో జరుగుతుందని తహశీల్దార్ తెలిపారు. ఆసక్తి కలిగిన వారు వేలంపాటలో పాల్గొనాలని సూచించారు.

## హాస్టల్‌లో సదుపాయాలపై సమగ్ర తనిఖీ






**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 8,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని అన్నపురెడ్డిపల్లి గ్రామపంచాయతీలో ఉన్న సోషల్ వెల్ఫేర్ బాయ్స్ పాఠశాల, కళాశాల హాస్టల్‌ను ఎంపీడీవో మహాలక్ష్మి పరిశీలించారు. హాస్టల్‌లోని స్టోర్ రూమ్, డైనింగ్ హాలు, కిచెన్ షెడ్‌ను తనిఖీ చేసి, స్టాక్ రిజిస్టర్లను వెరిఫికేషన్ చేశారు.హాస్టల్ పరిసరాల పరిశుభ్రతను కూడా పరిశీలించి, విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించే దిశగా తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. హాస్టల్‌లో ఆహార నాణ్యత, సరఫరా విధానంపై ప్రత్యేకంగా విచారణ చేసి, విద్యార్థులకు సమయానికి పోషకాహారం అందించాలని సూచించారు.విద్యార్థుల హాజరు, వసతి సదుపాయాలు, పడక గదుల నిర్వహణపై వివరాలు తెలుసుకున్నారు. తాగునీటి సౌకర్యం, పారిశుద్ధ్య పరిస్థితులపై కూడా దృష్టి సారించారు. హాస్టల్ పరిధిలో చెత్త పేరుకుపోకుండా తరచుగా శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని సూచించారు.విద్యార్థులు చదువుకు అనుకూలమైన వాతావరణంలో ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని తెలిపారు. అవసరమైన మరమ్మతులు వెంటనే చేపట్టి సదుపాయాలు మెరుగుపరచాలని ఆదేశించారు. సిబ్బంది తమ బాధ్యతలను సమర్థంగా నిర్వహించి, విద్యార్థుల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మహాలక్ష్మితో పాటు ప్రిన్సిపాల్ బాలరాజు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

## సాటివారిగూడెం అభివృద్ధికి అడుగులు వేస్తున్న సర్పంచ్

- నిధుల కోసం ఎంపీకి వినతి



**చుంచుపల్లి, ఏప్రిల్ 8 (ప్రజాజ్యోతి ):** లక్ష్మీదేవిపల్లి మండలం సాటివారిగూడెం గ్రామ అభివృద్ధి దిశగా సాటివారిగూడెం గ్రామ సర్పంచ్ వజ్జ విజయ భాస్కర్ కీలక చర్యలు చేపట్టారు. గ్రామంలో నెలకొన్న మౌలిక సదుపాయాల కొరతను పరిష్కరించాలనే ఉద్దేశంతో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామ్ రెడ్డికి సమగ్ర వినతిపత్రాన్ని సమర్పించారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా లేకపోవడంతో మురుగు నీరు ఇళ్ల ముందే నిల్వ ఉండి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ వివరించారు. దీని వలన గ్రామంలో ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశాలు పెరిగాయని పేర్కొన్నారు. వెంటనే డ్రైనేజీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఎస్సీ కాలనీ మరియు సాటివారిగూడెం గ్రామానికి చెందిన స్మశాన వాటికకు వెళ్లే రహదారి అధ్వాన స్థితిలో ఉండడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ముఖ్యంగా వర్షాకాలంలో రహదారి పూర్తిగా దెబ్బతిని, అంత్యక్రియల సమయంలో దారుణ పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పారు. వృద్ధులు, మహిళలు, చిన్నారులు ప్రయాణించలేని పరిస్థితి నెలకొనడంతో వెంటనే రహదారి అభివృద్ధి చేపట్టాలని కోరారు. స్థానిక స్మశాన వాటిక వద్ద బోరు పంపు లేకపోవడం వల్ల నీటి సమస్య తీవ్రంగా ఉందని పేర్కొన్నారు. అంత్యక్రియల సమయంలో అవసరమైన నీటి సదుపాయం లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనికి పరిష్కారంగా బోరు నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామంలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ), అంగన్వాడీ కేంద్రం, ప్రాథమిక పాఠశాల మరియు గ్రామ పంచాయతీ కార్యాలయాలకు ప్రహరీ గోడల నిర్మాణం అత్యవసరమని సర్పంచ్ స్పష్టం చేశారు. చిన్నారులు, ప్రజల భద్రత దృష్ట్యా ఈ పనులు చేపట్టడం అవసరమని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఎంపీ నిధుల ద్వారా పై అభివృద్ధి పనులకు తగిన నిధులు మంజూరు చేయాలని సర్పంచ్ వజ్జ విజయ భాస్కర్ వినతిపత్రంలో కోరారు. అనంతరం డీసీసీ అధ్యక్షురాలు దేవి ప్రసన్నను కలిసి గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు. స్పందించిన ఆమె మాట్లాడుతూ ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామ సహాయం రఘురామ్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామ అభివృద్ధికి తగిన నిధులు మంజూరు అయ్యేలా కృషి చేస్తామని తెలిపారు. సాటివారిగూడెం గ్రామ అభివృద్ధి కోసం అవసరమైన ప్రతి అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామ అభివృద్ధి పట్ల సర్పంచ్ చూపుతున్న చొరవపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. త్వరలోనే గ్రామ సమస్యలు పరిష్కారం కావాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు

## 108 వాహనం తనిఖీ

- సేవలపై అధికారుల సమీక్ష



**అశ్వాపురం, ఏప్రిల్ 8 ప్రజాజ్యోతి** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండల కేంద్రంలో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందిస్తున్న 108 అంబులెన్స్ వాహనాన్ని బుధవారం సంబంధిత అధికారులు తనిఖీ చేశారు. జీవీకే గ్రీన్ హెల్త్ సర్వీసెస్ కు చెందిన ఆడిట్ అధికారి కిషోర్, భద్రాచలం డివిజన్ ఎమర్జెన్సీ మేనేజ్ మెంట్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్ మనోహర్ తో కలిసి వాహనాన్ని అణువణువున పరిశీలించారు. ఈ సందర్భంగా అంబులెన్స్ లో ఉన్న వైద్య పరికరాలు, ఔషధాలు, ఆక్సిజన్ సిలిండర్లు, ఫస్ట్ ఎయిడ్ కిట్, వాహన నిర్వహణ పరిస్థితిని పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అత్యవసర సమయాల్లో ప్రజలకు వేగంగా, నాణ్యమైన సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది స్పందన సమయం, కాల్ రిస్పాన్స్, రోగుల పట్ల వ్యవహార శైలి వంటి అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు. సేవల్లో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, ప్రతి కేసును అత్యంత ప్రాధాన్యతతో తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎంటి సుజాత, ఆదిలక్ష్మి, పైలెట్ సాయినాథ్ పాల్గొన్నారు.

## మోరంపల్లిబంజర్ లోచలివేంద్రం ప్రారంభం

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 8 (ప్రజా జ్యోతి):** మండల పరిధిలోని మోరంపల్లి బంజర ప్రధాన కూడలిలో ప్రయాణీకులు, బాటసారుల సౌకర్యార్థం సర్పంచ్ బొర్రా సుభద్ర ఉపసర్పంచ్ పొక్కుల రవితో కలిసి బుధవారం చలివేంద్రం ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రయాణాల నిమిత్తం వచ్చే వారికి, బాటసారులకు, గ్రామస్థులకు మంచినీటిని అందించేందుకు ఈ చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రజలు చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ పొక్కుల రవితో పాటు పాలకవర్గ సభ్యులు పుల్లారెడ్డి, నాగిరెడ్డి, గ్రామస్థులు, దుకాణదారులు పాల్గొన్నారు.



## ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ జిల్లా కమిటీ ఎన్నిక

- అధ్యక్ష, కార్యదర్శులుగా యాకూబ్ పాషా , ఉప్పల్





**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 8,ప్రజాజ్యోతి:** తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్ట్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు జిల్లా కమిటీని స్థానిక కొత్తగూడెంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లా అధ్యక్షుడిగా రహనుమా–ఏ–దక్కన్ జాతీయ దినపత్రిక కొత్తగూడెం జిల్లా బ్యూరోగా పనిచేస్తున్న ఎండీ. యాకూబ్ పాషా,ఉపాధ్యక్షుడిగా రహనుమా–ఏ–దక్కన్ కొత్తగూడెం నియోజకవర్గ రిపోర్టర్ ఎండీ.జలీల్, ప్రధాన కార్యదర్శిగా మున్సిఫ్ ఉర్దూ చానల్ జిల్లా రిపోర్టర్ ఉప్పల్, సహాయ కార్యదర్శిగా మున్సిఫ్ పత్రిక రిపోర్టర్ ఎండీ రఫీ,కోశాధికారిగా మాజీద్ ఖురేషి,సభ్యులుగా ఎండీ అన్వర్,ఎంఏ నయీమ్‌లను ఎన్నుకున్నారు.ఈ ఎన్నికలను ఖమ్మం నుండి వచ్చిన టీయూడబ్ల్యూజేయూ జిల్లా అధ్యక్షుడు షేక్ అహద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నూతనంగా ఎన్నికైన కమిటీ రెండు సంవత్సరాలపాటు పదవిలో కొనసాగనుంది.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు యాకూబ్ పాషా మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టుల సంక్షేమం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

## కలివేరు బస్టాండ్ ను బాగు చేయండి

- బీజేపీ మండల అధ్యక్షులు నూప రమేష్





**చర్ల, ఏప్రిల్ 08:(ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో బుధవారం భారతీయ జనతా పార్టీ గ్రామ సందర్శన లో భాగంగా ప్రజా సమస్యలను గుర్తించి అధికారుల దృష్టికి తీసుకొని వెళ్లే కార్యక్రమంలో భాగం గా మండల కమిటీ కలివేరు గ్రామం సందర్శించటం జరిగింది.తోగుల వద్ద ఆక్రమణ కు గురై నిరూపయోగం గా ఉన్న ఆర్ టి సి బస్టాండ్ ను బాగుచేసి ప్రయాణికుల కు అందుబాటులో ఉంచాలని బీజేపీ మండల అధ్యక్షులు నూప రమేష్ డిమాండ్ చేశారు.వేసవి కాలం కావడం తో ప్రయాణికుల కు నీడ లేక ఎండ తీవ్రతకు చెట్ల కింద పక్కన ఉన్న షాపులలో తల దాచుకునే పరిస్థితి ఉంది అని త్రాగునీరు సౌకర్యం కూడా లేదు అని కలివేరు తోగుల నుండి జంగాలపల్లి వెళ్లే దారిలో వాహనాల వెంట దుమ్ము లేచి గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు అని ఈ రహదారి పై ట్యాంకర్ తో నీళ్లు చల్లించాలని అని ఆయన అన్నారు.ఈ విషయం పై గ్రామ కార్యదర్శికు దరఖాస్తు సమర్పించడం జరిగింది.ఈ కార్యక్రమం లో జిల్లా కౌన్సిల్ సభ్యులు బాబా ఫహీం. ఎంపీటీసీ ఇంచార్జి సరియం ధర్మరాజు. కార్యదర్శి చింతూరి విశ్వనాథం. మాజీ.బీసీ మోర్చా నాయకులు వెంబడి హరినాథ్. పర్సిక వినయ్. బోడిక సందీప్. సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# దిశా సర్వసభ్య సమావేశం

- జిల్లా అభివృద్ధి పనులపై సమగ్ర సమీక్ష
- తాగునీరు, వైద్యం, మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి
- సమావేశంలో పాల్గొన్న ఉమ్మడి ఖమ్మం జిల్లా ఎంపీ రామసహాయం రఘురాం రెడ్డి
- మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్




**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి:**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో దిశా సర్వసభ్య సమావేశం బుధవారం కలెక్టరేట్ కార్యాలయంలోని ఐడీఓసీ సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించారు, ఈ సమావేశానికి ఎంపీ రామసహాయం రఘు రామ్ రెడ్డి అధ్యక్షత వహించగా మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ కో–చైర్మన్‌గా పాల్గొని మాట్లాడారు, ముందుగా సమావేశంలో గత దిశా కమిటీ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు, వివిధ శాఖల అభివృద్ధి పనుల పురోగతి పై సమీక్షించారు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయాలని, ప్రతి శాఖ తన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పనుల పురోగతిని నివేదికల రూపంలో ఎప్పటికప్పుడు సమర్పించాలని , పెండింగ్ పనులను వేగవంతం చేసి, గత నిర్ణయాలను తప్పని సరిగా అమలు చేయాలని సమీక్ష లో సూచించారు.అనంతరం ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురామరెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం లో భాగంగా గతంలో కేంద్ర ప్రభుత్వం 90 శాతం నిధులు ఇస్తుందని, ఇప్పుడు కేవలం 60 శాతం మాత్రమే ఇచ్చే విధంగా మార్పు వచ్చి, మిగిలిన 40 శాతం నిధులు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. అదే విధంగా గృహ నిర్మాణ శాఖలో అనేక మార్పులు రావడం వలన పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడంలో సమస్యలు తలెత్తుతున్నాయని, ఈ సమస్యల పరిష్కారం కోసం సమగ్ర చర్చ జరిగిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ పథకాలు గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కీలకమని, ప్రతి పథకం లక్ష్యాలకు అనుగుణంగా లబ్ధిదారులకు సమయానికి ప్రయోజనాలు చేరేలా పర్యవేక్షణ పెంచాలని సూచించారు. వేసవి కాలంలో తాగునీటి సరఫరా, వైద్య సేవలు, విద్యుత్ వంటి ప్రాథమిక సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని స్పష్టం చేశారు.మణుగూరు, ఇల్లందు, భద్రాచలం, కొత్తగూడెం తదితర ప్రాంతాల ప్రభుత్వ ఆసుపత్రుల పరిశుభ్రత, ఆహార నాణ్యత, మరుగుదొడ్ల నిర్వహణ, అంబులెన్స్, డయాలసిస్ సేవల విస్తరణ, సికిల్ సెల్ అనీమియా, హెచ్‌పీవీ వ్యాక్సిన్ అవగాహన కార్యక్రమాలపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాలి అని సూచించారు. మిషన్ భగీరథ, అమృత్ పథకాల కింద తాగునీటి సరఫరా మరియు పైప్‌లైన్‌లీకేజీలను తొలగించడానికి ముందస్తు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీలలో త్రాగునీటి సరఫరా పనులను సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు.జాతీయ రహదారులు, ఆర్ & బి, విద్యుత్ శాఖల పనుల ఆలస్యంపై ఆగ్రహం వ్యక్తం చేసి, ఐటీడీఏ నిధులతో చేపట్టిన పనులలో ఆలస్యానికి కారణాలను వివరించాలని అధికారులు నివేదికలు సమర్పించాలని స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో కేంద్ర నిధులను సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాం నాయక్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై సమగ్రంగా చర్చించి, అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని, మారుమూల ప్రాంతాల వరకు త్రాగునీటి సరఫరా కల్పించాలని, ఆసుపత్రుల్లో అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి చేరేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువుల్లో పూర్తి చేయడం కోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. దిశా సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ప్రాధాన్యతగా తీసుకుని వాటి అమలును వేగవంతం చేయాలని, ప్రతి శాఖ తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ, పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు సకాలంలో చేరేలా పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని, పనుల నాణ్యతపై ఎటువంటి రాజీ పడకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సరఫరా, వైద్య సేవలు, విద్యుత్ వంటి ప్రాథమిక సేవలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు.శాసన సభ్యులు తమ నియోజకవర్గ పరిధిలో అమలవుతున్న కేంద్ర ప్రభుత్వ పథకాల పురోగతిపై అధికారులు సమగ్ర వివరణ ఇవ్వాలని కోరారు. అశ్వరావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకటరావు తదితరులు తమ నియోజకవర్గాల్లో పథకాల అమలు స్థితిగతులపై అధికారుల నుంచి సవివర నివేదికలు కోరారు. ఈ సమావేశంలో కొత్తగూడెం మున్సిపల్ మేయర్ మూడ్ గణేష్, అటవీశాఖ అధికారి కృష్ణ గౌడ్ , దిశ కమిటీ సభ్యులు, ఇల్లందు మున్సిపల్ చైర్‌పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, అశ్వరావుపేట మున్సిపల్ చైర్ పర్సన్ శశికళ, డి ఆర్ డి ఓ విద్యా చందన, జడ్పీ సీఈవో నాగలక్ష్మి , కొత్తగూడెం ఆర్డీవో మధు, దిశా కమిటీ సభ్యులు బుర్ర సురేష్, యేసుమని, స్వర్ణ జిల్లా అధికారులు ప్రజాప్రతినిధులు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలు గాలికొదిలేసిన ఐటీసీ యాజమాన్యం

- కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ డిమాండ్

**బూర్గంపహాడ్, ఏప్రిల్ 8 (ప్రజా జ్యోతి ):**రెండు వారాలుగా కాంట్రాక్టు కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం రిలేదీక్షలు చేపట్టినా ఐటీసీ యాజమాన్యం ఆ సమస్యలను గాలికొదిలేసిందని, చర్చలకు కూడా పిలవకుండా తాత్సారం చేస్తుందని కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ కన్వీనర్ పాటి సోమిరెడ్డి, కో–కన్వీనర్లు సానికొమ్ము రామచంద్రారెడ్డి, బల్లెం నాగయ్య, ఎండీ యాకూబ్ భాషా హెచ్చరించారు. బుధవారం రిలేనిరాహారదీక్షలు 14వ రోజుకు చేరుకోవడంతో ఈ దీక్షల్లో తోకల నరేష్, ప్లాంటేషన్ మహిళా కార్మికులు బోళ్ల సమ్మక్క, దార్ల కవిత, పత్రా సుమిత్ర, గంధం సిరిలు పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా జేఏసీ బాధ్యులు మాట్లాడుతూ 14 రోజులు పూర్తయినా ఐటీసీ యాజమాన్యం నుంచి ఎలాంటి పిలుపులేదని, కార్మికుల సహనాన్ని పరీక్షిస్తే మున్ముందు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని, ఇప్పటికైనా ఐటీసీ యాజమాన్యం దిగి వచ్చి కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, లేదంటే సమ్మెబాట పట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ రిలే దీక్షల్లో జేఏసీ సభ్యులు ఆకిని సర్వేశ్వరరావు, కందాల వెంకటరెడ్డి, సుంకిరెడ్డి వెంకటరెడ్డి, మర్రి వెంకటరెడ్డి, చుక్కపల్లి బాలాజీ, సూరిశెట్టి జగదీష్, కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.



## గ్రామోత్సవంలో అవగాహన కార్యక్రమం

- ఆదివాసీలకు విద్య, సమాజ బాధ్యతలపై చైతన్యం



**పాల్వంచ, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:** పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని వలస ఆదివాసి గ్రామమైన రెడ్డిగూడెం, ప్రభాత్ నగర్ లో నిర్వహించిన గ్రామోత్సవ కార్యక్రమం సందర్భంగా ప్రజలకు ముఖ్యమైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆదివాసీలు నక్సలిజం వంటి అసాంఘిక కార్యకలాపాల వైపు వెళ్లకూడదని, అలాంటి చర్యల వల్ల కలిగే నష్టాలు, ఇబ్బందులు గురించి వివరించారు.అలాగే పిల్లలను చదువుకు ప్రోత్సహించడం, విద్య ద్వారా వచ్చే ప్రయోజనాలను వివరించి తల్లిదండ్రుల్లో చైతన్యం కలిగించారు. విద్యతో వ్యక్తిగతంగా మరియు సమాజపరంగా అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో బి. సురేష్, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్, పాల్వంచ రూరల్ పోలీస్ స్టేషన్, కొర్స మల్లయ్య, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఉల్వనూర్ గ్రామం, పడిగ సత్యనారాయణ, ప్రభుత్వ ఉపాధ్యాయుడు, ఉల్వనూరు–లక్ష్మీదేవిపల్లి గ్రామంఈ సందర్భంగా గ్రామస్తులు కార్యక్రమానికి మంచి స్పందన చూపారు.

# బాబా చిక్తరాజ్ దేవ్ మహా జాతర

- 12 సంవత్సరాల పునర్జన్మకు ప్రత్యేక పూజ
- దేవడోంగ్రి పర్వతం నుండి తీసుకువచ్చిన దైవ విగ్రహం





**చర్ల, ఏప్రిల్ 08(ప్రజా జ్యోతి):** ఛత్తీస్గఢ్ రాష్ట్రంలో ప్రతి సంవత్సరం లాగే, బీజాపూర్ జిల్లా కేంద్రంలో బాబా చిక్తరాజ్ దేవ్ సాంప్రదాయ జాతర ప్రజల విశ్వాసంతో ఉత్సాహంతో జరిగింది. ఈ జాతరను గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు దేవతామూర్తుల సామూహిక సమావేశానికి ఒక ప్రధాన కేంద్రంగా పరిగణిస్తారు.భక్తుల విశ్వాసం ప్రకారం 12 సంవత్సరాల తర్వాత బాబా చిక్తరాజ్ దేవ్ 'పునర్జన్మ' ఎత్తడం ఈ సంవత్సరం జాతర యొక్క అతిపెద్ద విశేషం. ఈ సందర్భంగా ప్రత్యేక పూజ నిర్వహిస్తారు సంప్రదాయం ప్రకారం బీజాపూర్ నుండి సుమారు 10 కిలోమీటర్ల దూరంలో ఉన్న దేవడోంగ్రి పర్వతం నుండి బాబాను యథావిధిగా ఆచారాలతో తీసుకువచ్చి జాతర ప్రదేశంలో ప్రతిష్ఠించారు.ఈ జాతర యొక్క మరో విశేషం ఏమిటంటే, నక్సలిజం ప్రభావం తగ్గుముఖం పట్టడం వల్ల మారుమూల గ్రామాల నుండి కూడా దేవతలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరు అవుతారు . సంవత్సరాలుగా దేవతలు చేరుకోలేని అనేక గ్రామాలు ఈసారి జాతరలో పాల్గొన్నాయి.జిల్లా నలుమూలల నుండి దేవతల సంగమం జిల్లాలోని గుంజపోతేనార్, తుమ్డోకరి, కమ్కనార్, మరముయ్యో, ముంగా, కంపరాజ్ దేవ్ గోగ్లా, పోత్రాజ్ దేవ్ చెర్పాల్, తుమ్నార్, పెద్దనోజర్, టిడ్కా, కడేనార్, నబ్బి, ఉసూర్ పడమూరు నుండి అనేక గ్రామ దేవతలు జాతరకు హాజరవుతారు. ఈ దేవతలు బాబా చిక్కరాజ్‌ని దర్శిస్తారని నమ్ముతారు ఈ జాతర ఒక పండుగలా జరుపుకుంటారు.ప్రతి గ్రామానికి వారి నమ్మకాలకు అనుగుణంగా నిర్వహించే విభిన్నమైన పూజా విధానం బలి సంప్రదాయం ఉంటుంది. జాతర సమయంలో పూజారులు కమిటీ సభ్యులు ప్రత్యేక నియమాలను పాటిస్తారు. వారు ఇంట్లో వండిన ఆహారాన్ని తినరు కానీ దేవతకు సమర్పించిన నైవేద్యాలను మాత్రమే స్వీకరిస్తారు.చిక్తరాజ్ దేవ్ సమితి సభ్యుడైన సుఖ్‌లాల్ పూజారి మట్టి పూజారి ప్రకారం ఈ జాతర మూడు రోజుల పాటు జరుగుతుంది

**మొదటి రోజు:** దేవతామూర్తుల రాక స్వాగతం,

**రెండవ రోజు:** తహసీల్ కార్యాలయం నుండి ఖజానా తనిఖీ సాంప్రదాయ ఆచారాలు,

**మూడవ రోజు మంగళవారం:** ప్రధాన జాతర, సంత పూజ,

**బుధవారం:** ముగింపు వేడుక.

విశ్వాసం, సంప్రదాయం సామాజిక ఐక్యతకు ప్రతీక అయినఈ జాతర, కేవలం మత విశ్వాసానికి కేంద్రం మాత్రమే కాదు, గిరిజన సంస్కృతికి, నీరు, అడవి భూమికి సంబంధించిన సంప్రదాయాలకు, సామాజిక ఐక్యతకు కూడా చిహ్నం. గ్రామస్థులు తమ కోరికల నెరవేర్పు కోసం ఇక్కడ మొక్కులు మొక్కుకుంటారు అవి నెరవేరినప్పుడు వారు ప్రత్యేక ప్రార్థనలు బలులు అర్పిస్తారు.ప్రతి సంవత్సరం ఈ జాతర ఈ ప్రాంత సాంస్కృతిక వారసత్వాన్ని సజీవంగా ఉంచడానికి ఒక ముఖ్యమైన మాధ్యమంగా మారుతోంది. ఈ సమితిలో సుమారు 12 మంది సభ్యులు ఉంటారు వారందరికీ పనులు విభజించి కమిటీ సభ్యులందరూ కొన్ని నియమాలను పాటించాల్సి ఉంటుంది. దేవతకు కొన్ని నియమాలు ఉన్నాయి, వాటి ప్రకారం కమిటీ సభ్యులు ప్రధాన నైవేద్యం కోసం సిద్ధం చేసిన ఆహారాన్ని తినాలి మంగళవారం ఉపవాసం పాటించాలి. యజ్ఞయాగాది ఆచారంలో, ఆలయంలోనూ, ప్రాంగణం బయట కూడా బలి ఇచ్చే ఏర్పాటు ఉంది. ఇది శతాబ్దాలుగా అనుసరిస్తున్న గిరిజన సంస్కృతిని ప్రజలు వైభవంగా నిర్వహిస్తారు .

## ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ జిల్లా కన్వీనర్‌గా బుడగం నాగేశ్వరరావు నియామకం



**పాల్వంచ, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణానికి చెందిన బుడగం నాగేశ్వరరావు ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ (ఏఐఎఫ్‌బీ) జిల్లా కన్వీనర్‌గా నియమితులయ్యారు. స్వాతంత్ర సమర యోధుడు నేతాజీ సుభాష్ చంద్ర బోస్ స్థాపించిన ఈ పార్టీకి చెందిన నియామక పత్రాన్ని బుధవారం ఖమ్మంలో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి ఆయనకు అందజేశారు.ఈ సందర్భంగా బుడగం నాగేశ్వరరావు మాట్లాడుతూ, నేతాజీ స్థాపించిన ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ పార్టీకి గొప్ప చరిత్ర ఉందని పేర్కొన్నారు. పార్టీ ఆశయాలను ప్రజల్లో విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.జిల్లా కన్వీనర్‌గా తన నియామకానికి సహకరించిన రాష్ట్ర కన్వీనర్ అంబటి జోజి రెడ్డి, జాతీయ ప్రధాన కార్యదర్శి దేవరాజన్, జాతీయ కార్యదర్శి ఆర్.వి. ప్రసాద్, నాయకులు కొండ దయానంద్, కృష్ణమూర్తి, బుచ్చిరెడ్డి, దిలీప్‌లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేస్తూ, నేతాజీ ఆశయాల సాధనకు కట్టుబడి పనిచేస్తానని ఈ సందర్భంగా వెల్లడించారు.

## ఎంపీలను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించిన కొత్వాల శ్రీనివాసరావు



**పాల్వంచ, ఏప్రిల్ 8, ప్రజాజ్యోతి:** ఖమ్మం పార్లమెంట్ సభ్యుడు రామసహాయం రఘురాంరెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాం నాయక్‌లను రాష్ట్ర మార్కెఫెడ్ మాజీ డైరెక్టర్, డిసిఎంఎస్ మాజీ చైర్మన్ కొత్వాల శ్రీనివాసరావు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో సన్మానించారు.బుధవారం పాల్వంచ కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన 'దిశ' సమావేశం సందర్భంగా కొత్తగూడెం పొంగులేటి క్యాంపు కార్యాలయా నికి విచ్చేసిన ఎంపీలను కొత్వాల శ్రీనివాసరావు కలుసుకుని సత్కరించారు. ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమంలో ఎంపీలతో కలిసి ఆయన పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోట దేవీప్రసన్న, డిప్యూటీ మేయర్ సిరిపురపు లలిత కుమారి, మాజీ జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖరరావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ జాలే జానకిరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోండం వెంకన్న గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగ సీతారాములు, ఆళ్ళ మురళి, ఉకంటి గోపాలరావు, సందు ప్రభాకర్, గంగిరెడ్డి భువన సుందర్ రెడ్డి, సామ వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వనవాసీ పరిషత్ కు బియ్యం వితరణ

**చర్ల, ఏప్రిల్ 08 :(ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలో బుధవారం శ్రీ దత్తసాయి మందిరం అర్చకులు పున్నమరాజు విజయకుమార్ శర్మ – లలిత దంపతుల కుమార్తె శ్యామల జన్మదినం పురస్కరించుకొని వనవాసీ కళ్యాణ పరిషత్ కొమరం భీం విద్యార్థి నిలయంకు 50 కేజీల బియ్యం, విద్యార్థులకు భోజనం, స్వీట్స్, పండ్లను అందచేసారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వనవాసీ ప్రాంత సంఘటనా కార్యదర్శి వేముక ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థి నిలయం నిర్వహణకు దాతలు అందచేస్తున్న సహకారం మరువలేనిదని పేర్కొన్నారు. విద్యార్థులు ఇటువంటి అవకాశాలను అందిపుచ్చుకొని జీవితంలో ఉన్నత స్దితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి నిలయం ఉపాధ్యక్షులు గోగికార్ రాంలక్ష్మణ్, సహ కోశాదికారి వేములపల్లి ప్రవీణ్ బాబు, నిలయ ప్రముఖ్ గొంది ప్రసన్నకుమారి పాల్గొన్నారు.



## గ్రామాల్లో నీటి కొరత రాకుండా చర్యలు చేపడతాం: సర్పంచ్ ఆదిలక్ష్మి





**ములకలపల్లి, ఏప్రిల్ 08, ప్రజాజ్యోతి:** మండలంలోని మూకమామిడి గ్రామ పంచాయతీ పరిధిలోని మొగరాలగుప్ప పాఠశాల, ఒడ్డుగుంపు గ్రామాల్లో పాడైన చేతి పంపులను సర్పంచ్ కోర్సా ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో మంగళవారం మరమ్మత్తు చేశారు. స్థానికులు సమస్యను ఆమె దృష్టికి తీసుకురావడంతో వెంటనే స్పందించి పంపులను పరిశీలించారు. మెకానిక్ లు సామగ్రి పూర్తిగా తుప్పు పట్టినట్లు గుర్తించడంతో, కొత్త విడి భాగాలను సమకూర్చి మరమ్మత్తులు చేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆదిలక్ష్మి మాట్లాడుతూ... వేసవికాలంలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో చేతి పంపులను దశలవారీగా మరమ్మత్తు చేయించి, ప్రజలకు తాగునీటి ఇబ్బందులు రాకుండా చూస్తామని చెప్పారు. వేసవిలో భూగర్భ జలాలు తగ్గిపోవడం సహజమని, అందుకు అనుగుణంగా నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని, అవసరానికి మించి వృథా చేయవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ కేసుపాక శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ కీసరి లక్ష్మి, ప్రధానోపాధ్యాయురాలు స్వరూప, ఉపాధ్యాయులు సుదీర్, బాబూలాల్, అంగన్‌వాడీ టీచర్ రమాదేవి, మెకానిక్ కారం వెంకటేశ్వర్లు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనులపై సమీక్ష సమావేశం

- ఎంపీడీవో వెంకటేశ్వరరావు





**పినపాక,ఏప్రిల్ 08(ప్రజాజ్యోతి):** ఉపాధి హామీ పనులను సమర్థవంతంగా అమలు చేయాలని ఎంపీడీవో వెంకటేశ్వరరావు సూచించారు. మంగళవారం పినపాక ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అమలుపై ఉపాధి హామీ సిబ్బంది, గ్రామ సెక్రటరీలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనుల నాణ్యత, పారదర్శకతకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి అర్హుడైన కార్మికుడికి ఉపాధి కల్పించేందుకు కృషి చేయాలని ఆదేశించారు.అలాగే, పనులు సమయానికి పూర్తి కావాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని సిబ్బందికి సూచనలు ఇచ్చారు. గ్రామ స్థాయిలో పనుల పర్యవేక్షణ మరింత బలోపేతం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ వీరభద్ర స్వామి, ఉపాధి హామీ సిబ్బంది, గ్రామపంచాయతీ సెక్రటరీలు, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

## సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళల్లో మార్పు కోరుతూ నిరసన



**కొత్తగూడెం, ఏప్రిల్ 8 ( ప్రజాజ్యోతి )**ఎండ తీవ్రత కారణంగా సింగరేణి కాంట్రాక్ట్ కార్మికుల పని వేళల్లో మార్పులు చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ డిమాండ్ చేశారు. అవసరమైతే ఎండాకాలం పూర్తయ్యే వరకు ఒక్కపూట మాత్రమే పనులు నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా సివిల్ ఎస్ఈ కార్యాలయం వద్ద కార్మికులు నిరసన వ్యక్తం చేసి అధికారులకు వినతి పత్రం అందజేశారు. భూక్య రమేష్ మాట్లాడుతూ 40 డిగ్రీల పైగా ఉష్ణోగ్రతల్లో కార్మికులు పని చేస్తున్నారని ఇది వారి ఆరోగ్యానికి ప్రమాదకరమని అన్నారు. బొగ్గు బావుల పరిసరాల్లో, ఇతర సివిల్ పనుల్లో తీవ్ర ఎండలో పని చేయాల్సి వస్తోందని తెలిపారు. యాజమాన్యం వెంటనే స్పందించి పని వేళల్లో మార్పులు చేయాలని లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గుగులోత్ సక్రాం తదితరులు పాల్గొన్నారు.

## దమ్మపేటలో వ్యక్తి అదృశ్యం

- **కేసు నమోదు, గాలింపు చర్యలు ప్రారంభం**



**దమ్మపేట,ఏప్రిల్. 08, (ప్రజాజ్యోతి ):** దమ్మపేట పోలీస్ స్టేషన్ పరిధిలో వ్యక్తి అదృశ్యమైన ఘటనపై కేసు నమోదు అయింది. ఫిర్యాదుదారు ఈడ రమ్య శ్రీ మోద్దులగూడెం గ్రామంలో నివసిస్తున్నారు. ఆమె ఫిర్యాదు ప్రకారం, ఆమె భర్త ఆయుష్ కంపెనీలో మక్కజొన్న విత్తనాల ఆర్గనైజర్‌గా పనిచేస్తూ, ది. 31-03-2026న ఉదయం సుమారు 09:00 గంటలకు విధులకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. అనంతరం కుటుంబ సభ్యులు మరియు గ్రామస్థులతో కలిసి అనేక ప్రాంతాల్లో వెతికినా ఆయన ఆచూకీ లభించలేదు. ఈ విషయమై బుధవారం దమ్మపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా,క్రైం నెంబర్ 84/2026కింద కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. అదృశ్యమైన వ్యక్తి గురించి ఎవరైనా సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను తెలియజేయాలని దమ్మపేట ఎస్ ఐ సాయి కిషోర్ రెడ్డి తెలియజేశారు.

## యువ న్యాయవాది హత్యపై ఆగ్రహం

- **దమ్మపేట న్యాయవాదుల విధుల బహిష్కరణ**



**దమ్మపేట,ఏప్రిల్. 08, (ప్రజాజ్యోతి ):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన యువ న్యాయవాది పూజారి ఎల్లయ్యను సోమవారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు దారుణంగా హత్య చేసిన ఘటనపై రాష్ట్రవ్యాప్తంగా న్యాయవాదులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనను ఖండిస్తూ సంఘీభావంగా దమ్మపేట న్యాయవాదులు విధులను బహిష్కరించారు. ఈ కార్యక్రమంలో దమ్మపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు గొంది మురళి మోహన్, జనరల్ సెక్రటరీ లక్కినేని నరేంద్ర, వైస్ ప్రెసిడెంట్ సుధాకర్, సీనియర్ న్యాయవాది అడమ్స్, అలాగే సంధ్య రాణి, భవాని కృష్ణ, దర్గావళి, బాలరాజు, ఉదయ్, అప్పారావు, శ్వేత తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

## బాల వైద్య నిపుణుడిని ఘనంగా అభినందించిన ఉపాధ్యాయ సంఘం



**భద్రాచలం, ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి:** రాష్ట్ర ఉత్తమ సేవా పురస్కారం అందుకున్న భద్రాచలానికి చెందిన ప్రముఖ బాల వైద్య నిపుణుడు డాక్టర్ క్రాప విజయ్‌ను తెలంగాణ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ నాయకత్వం బుధవారం ఘనంగా అభినందించింది. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి ఆయన సేవలను ప్రశంసించింది. సమాజానికి ఆయన అందిస్తున్న వైద్య సేవలు ఆదర్శప్రాయమని కొనియాడింది.ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి విజయ్ కుమార్ మాట్లాడుతూ, డాక్టర్ క్రాప విజయ్ అందుకున్న ఈ గౌరవం ఆయన వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే కాకుండా భద్రాచలం ప్రాంతానికి గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో ఆయన సేవలు మరింత విస్తరించి సమాజానికి మరిన్ని మేలు చేకూర్చాలని ఆకాంక్షించారు.అనంతరం, చిన్నారుల ఆరోగ్య సంరక్షణలో విశిష్ట సేవలు అందించినందుకు గాను డాక్టర్ విజయ్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ సేవా పురస్కారం ప్రదానం చేసింది. తెలంగాణ రాష్ట్ర ప్రజా పాలన – ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 7న నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ చేతుల మీదుగా ఈ పురస్కారం అందజేయబడింది.చిన్నారుల ఆరోగ్యానికి అంకితభావంతో సేవలందిస్తూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ విజయ్, ఆర్థికంగా బలహీన వర్గాలకు అందుబాటులో సేవలు అందించడం ద్వారా ప్రత్యేక గుర్తింపు పొందారు. అనేక కుటుంబాలకు ఆశాకిరణంగా నిలిచారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ కార్యాలయ కన్వీనర్ టీవీఎస్ ప్రసాద్, మండల అధ్యక్షులు కొమరం శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి పి ఎస్ వి ప్రసాద్ బాబు, ఖజాంచీ ఆశలత, కన్వీనర్ సైదులు, సీనియర్ నాయకులు రాజా శ్రీనివాస్, మండల బాధ్యులు జి వెంకటేశ్వర్లు, తులసీరామ్ తదితరులు పాల్గొన్నారు.

## కొమరం భీమ్ విగ్రహావిష్కరణకు తాటి వెంకటేశ్వర్లుకు ఆహ్వానం



**దమ్మపేట,ఏప్రిల్. 08, (ప్రజాజ్యోతి ):** పాల్వంచ మండలం తోగ్గుడెం గ్రామంలో ది.14-04-2026 న బుధవారం నిర్వహించనున్న జల్-జంగిల్-జమీన్ పోరాట యోధుడు, ఆదివాసీల ముద్దుబిడ్డ కొమరం భీమ్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి అశ్వారావుపేట, బూర్గంపాడు మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర మాజీ తొలి ట్రైకార్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లును దమ్మపేటలోని వారి నివాసంలో ఆదివాసీ నాయకులు కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు అభిషేకం, నిత్యకల్యాణం



**భద్రాచలం, ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి:**భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారి ఆలయంలో బుధవారం స్వామి వారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, యజ్ఞోపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనంను వైదిక సిబ్బంది నిర్వహించారు.

## గిరిజన ఉత్పత్తులకు ప్రోత్సాహం ఇవ్వాలి

- **భద్రగిరి మార్ట్ సిబ్బందికి ఏపీఓ డేవిడ్ రాజ్ సూచనలు**



**భద్రాచలం, ఏప్రిల్ 8, ప్రజా జ్యోతి:**ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ప్రత్యేక శ్రద్ధతో గిరిజనులకు ఆర్థికంగా చేయూత అందించేందుకు నూతనంగా ప్రారంభించిన భద్రగిరి మార్ట్‌లో విక్రయిస్తున్న ఆర్గానిక్ నిత్యావసర సరుకులపై వినియోగదారులకు పూర్తి సమాచారం అందించే బాధ్యత మేనేజర్, సిబ్బందిపై ఉందని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి (ఏపీఓ) జనరల్ డేవిడ్ రాజ్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం ఐటీడీఏ యూనిట్ అధికారులతో కలిసి భద్రగిరి మార్ట్‌ను సందర్శించిన ఆయన, అక్కడ విక్రయిస్తున్న నిత్యావసర సరుకుల వివరాలు, స్టాక్ ఎంట్రీలు, అమ్మకాల రికార్డులను పరిశీలించారు. సరుకుల నిర్వహణ విధానం గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.వినియోగదారులకు అందించే సరుకులు ఆర్గానిక్, సేంద్రియ పద్ధతుల్లో గిరిజన రైతులు ఉత్పత్తి చేసినవే కావాలని ఆయన సూచించారు. అలాగే స్వయం సహాయక సంఘాలు సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలను నడుపుతున్న గిరిజన మహిళలు సరఫరా చేసే నిత్యావసర వస్తువులను మాత్రమే విక్రయించాలని చెప్పారు.భద్రగిరి మార్ట్‌కు వచ్చే సరుకులను ఆర్డర్ ప్రకారం స్వీకరించి, వెంటనే నాణ్యతను పరిశీలించి స్టాక్‌లో నమోదు చేయాలని సూచించారు. సరుకులను ఆకర్షణీయంగా ప్యాక్ చేసి వినియోగదారులకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. విక్రయించే అన్ని వస్తువులు ఎంఆర్పీ ధరల ప్రకారమే ఉండాలని పేర్కొన్నారు.వినియోగదారులు కొత్తగా ఆర్గానిక్, పోషకాహారానికి సంబంధించిన ఉత్పత్తులు కోరితే వాటి వివరాలను సేకరించి సంబంధిత అధికారులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో ఉద్యానవన అధికారి ఉదయ్ కుమార్, ఏపీఓ (పవర్) వేణు, జేడీఎం హరికృష్ణ, జీసీసీ మేనేజర్ జయరాజ్, ఐటీడీఏ మేనేజర్ ఆదినారాయణ, భద్రగిరి మార్ట్ మేనేజర్ భార్గవి, సిబ్బంది శ్రీనివాస్, సాయి చంద్, కార్తీక్, ఝాన్సీ లక్ష్మి, నవ్య, భవ్య, భూదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఆనకట్ట మరమ్మత్తు పనులు ప్రారంభించిన సర్పంచ్ గంప సుజాత





**ములకలపల్లి, ఏప్రిల్ 08, ప్రజాజ్యోతి:** మాదారం గ్రామంలోని ఎర్ర చెరువు ఆనకట్ట మరమ్మత్తు పనులను బుధవారం సర్పంచ్ గంప సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గత సంవత్సరం కురిసిన భారీ వర్షాల కారణంగా ఎర్ర చెరువు ఎడమ వైపు ఆనకట్టకు గండి పడటంతో చెరువులో నీరు నిల్వ లేక రైతులు పంట నష్టాలు ఎదుర్కొన్నారని తెలిపారు. రైతులకు ఇబ్బందులు లేకుండా సాగునీటి సౌకర్యం కల్పించేందుకు రూ.5 లక్షల వ్యయంతో ఈ మరమ్మత్తు పనులు చేపట్టినట్లు చెప్పారు. వచ్చే వర్షాకాలానికి ముందే పనులను పూర్తి చేసి రైతులకు సాగునీరు అందేలా చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ముదిగొండ వెంకన్న, చనగాని వినోద్, గంప సత్యం, కొయ్యాల వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు